క్లుప్తంగా

ఒలింపియాడ్ పోటీలకు టైనీటాట్స్ విద్యార్థి



నరసరావుపేట ఈస్ట్: టైనీటాట్స్ పాఠశాల 8వతరగతి విద్యార్థి వై.నీరజ్‌రెడ్డి జాతీయ స్థాయి ఒలంపియాడ్ పోటీ పరీక్షకు ఎంపికైనట్టు పాఠశాల ఏఓ ఎలవర్తి శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. ఈనెల 10వతేదీన గుంటూరులో కెన్‌కెన్ ఇంటర్నేషనల్ మ్యాథ్స్ ఒలింపియాడ్ సంస్థ నిర్వహించిన రాష్ట్రస్థాయి మ్యాథ్స్ పజిల్ పోటీలో నీరజ్‌రెడ్డి కప్పా విభాగంలో కాంస్య పతకం సాధించి ఈనెల 17వతేదీన ముంబైలో జరగనున్న జాతీయ స్థాయి పోటీకి ఎంపికైనట్టు వివరించారు. నీరజ్‌రెడ్డిని పాఠశాల డైరెక్టర్ పాతూరి కోటేశ్వరమ్మ, ఉపాధ్యాయులు అభినందించారు.

ద్విచక్ర వాహనాల వేలం



రొంపిచర్ల: స్థానిక పోలీస్ స్టేషన్‌లో వివిధ కేసుల్లో పట్టుబడిన మూడు ద్విచక్ర వాహనాలకు మంగళవారం బహిరంగ వేలం నిర్వహించారు. వేలంలో మూడు వాహనాలకు రూ.53,725 రూపాయలు వెచ్చించి పాటదారులు పాడుకున్నారు. వేలంలో వాహనాలను పాడుకున్న వారికి వాటిని స్వాధీనం చేశారు. వేలం పాట కార్యక్రమంలో రూరల్ సీఐ కృష్ణయ్య, ఎస్‌ఐ పి.వి. రవీంద్ర, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

చేతిరాత పోటీల్లో వినుకొండ విద్యార్థులకు బహుమతులు



వినుకొండ(నూజెండ్ల): నేషనల్ హ్యాండ్ రైటింగ్ అకాడమీ హైదరాబాద్ వారు గత నవంబరు నెలలో జాతీయస్థాయిలో నిర్వహించిన హ్యాండ్ రైటింగ్ పోటీల్లో వినుకొండకు చెందిన ఆదిత్య హైస్కూల్ విద్యార్థులు ఆర్.యశ్వంత్, జి.ఆదిలక్ష్మి, విద్యావికాస్ హైస్కూల్‌కి చెందిన విద్యార్థులు బత్తుల రాజశ్రీలు బహుమతులు సాధించారు. హైదరాబాద్‌లో జరిగిన బహుమతుల ప్రధానోత్సవంలో ప్రముఖ అంతర్జాతీయ చేతిరాత నిపుణులు వై.మల్లికార్జునరావు, ప్రముఖ సైకాలజిస్ట్ సుధీర్ చేతుల మీదుగా విద్యార్థులు బహుమతులు అందుకున్నారు. బహుమతులు పొందిన విద్యార్థులను చేతిరాత నిపుణులు సోమేపల్లి వెంకట సీతారామయ్య, పాఠశాల డైరెక్టర్లు వి. రవి, తిరుమలశెట్టి బాలయ్య, చేకూరి ఏడుకొండలు తదితరులు అభినందించారు.

రైతులను ప్రభుత్వం ఆదుకుంటుంది



ఈపూరు: మిచౌంగ్ తుఫాన్ కారణంగా నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని నరసరావుపేట ఉద్యాన అధికారి దాసరి నవీన్ కుమార్ తెలిపారు. తుఫాన్ కారణంగా మండలంలోని ముప్పాళ్లలో అరటి తోట, గోపువారిపాలెం, చిట్టాపురం గ్రామాల్లో దెబ్బతిన్న మిరప పంటలను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పంటలను రక్షించుకునేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. ఏమైనా సమస్యలు ఉన్నట్లయితే ఆర్‌బీకేల్లోని ఉద్యాన సహాయకులను సంప్రదించాలని సూచించారు.

కాంట్రాక్ట్ కార్మికులకు సెలవులు ఇవ్వాలి



నరసరావుపేట: విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులకు పెయిడ్ హాలిడేస్, టెన్ ఇయర్స్ ఇన్సెంట్ ఇవ్వాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ డివిజన్ అధ్యక్షులు ఎం.సుబ్బారెడ్డి కోరారు. మంగళవారం యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) సమావేశం జల్లెడ రాజశేఖర్ అధ్యక్షత కార్యాలయంలో నిర్వహించారు. జిల్లా గౌరవ అధ్యక్షులు ఎస్.ఆంజనేయులు నాయక్ మాట్లాడుతూ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా డిసెంబర్ 18న డివిజన్ ఆఫీసుల వద్ద నిరసన కార్యక్రమాలు చేయాలని పిలుపు ఇచ్చారు. సబ్‌స్టేషన్ వాచ్‌మెన్‌లను ఫీల్డ్‌లో వాడుకోవటం వలన రాత్రిపూట డ్యూటీలో ఇబ్బంది కలుగుతుందన్నారు. ఉద్యోగులు పాల్గొన్నారు.

జగనన్న పాలనలో ప్రతి ఇంటికీ లబ్ధి

- పేట మునిసిపల్ చైర్మన్ రఫాని
- గణపవరం 3వ సచివాలయం పరిధిలో వై ఏపీ నీడ్స్ జగన్



పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న మున్సిపల్ చైర్మన్ రఫానీ, వైస్‌చైర్మన్ వెంకటేశ్వరరావు

నాదెండ్ల: మీ కుటుంబానికి మేలు జరిగి ఉంటేనే తనకు ఈ సారి ఓటేయాలని చెప్పిన ఏకైక ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అని మున్సిపల్ చైర్మన్ షేక్ రఫానీ చెప్పారు. గణపవరం 3వ సచివాలయంలో మంగళవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. నాలుగున్నరేళ్లలో ప్రత్యక్షంగా, పరోక్షంగా సచివాలయం పరిధిలో రూ.18,44,56,346లు మేలు జరిగిందన్నారు. వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి, మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి అనే పోస్టర్‌ను ఆవిష్కరించారు. పంచాయతీ కార్యదర్శి కాట్రగడ్డ కవిత అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను చిత్తశుద్ధితో నెరవేర్చారన్నారు. యువతకు ఉపాధి అవకాశాలు, సచివాలయ వ్యవస్థ ద్వారా లక్షలాది ఉద్యోగాలు, వలంటీర్ల వ్యవస్థ ద్వారా సంక్షేమ పథకాలు లబ్ధిదారుల ఇళ్ల వద్దకే దరిచేర్చటం విప్లవాత్మక పాలనకు నిదర్శనాలన్నారు. నాడు నేడు ద్వారా విద్య, వైద్య రంగాల్లో, జగనన్న సురక్ష, ఫ్యామిలీ డాక్టర్ విధానంలో ప్రతి పేదవాడికి మెరుగైన వైద్యసేవలు జరుగుతున్నాయన్నారు. మహానేత డాక్టర్ వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి ఫీజు రీయింబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ, 108 వంటి పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రజల మన్ననలు పొంది రెండోసారి ముఖ్యమంత్రి అయ్యారన్నారు. అదే విధంగా పేద ప్రజల కోసం ఎన్నో సంక్షేమ, అభివృద్ధి పథకాలు అందిస్తున్న జగన్‌మోహన్ రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి అవుతారన్నారు. గడిచిన నాలుగున్నరేళ్లలో యువతకు ఉద్యోగ అవకాశాలు, అన్ని వర్గాల వారికి సమాన అవకాశాలు, పదవులు దక్కాయన్నారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వాన్ని మరోసారి గెలిపిస్తే సంక్షేమ పథకాలు యధావిధిగా అందుతాయన్నారు. అనంతరం పలుకాలనీల్లో పర్యటించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ వలేటి వెంకటేశ్వరరావు, కౌన్సిలర్లు ఆదంవలి, బేరింగ్ మౌలాలి, మార్కెట్ యార్డు చైర్మన్ తోట రాజేంద్రప్రసాద్, మాజీ సర్పంచ్ కెల్లంపల్లి సుందరరావు, విడదల కమలేంద్ర, మాజీ సొసైటీ చైర్మన్ కాటా రత్తయ్య, లిఫ్ట్ ఇరిగేషన్ చైర్మన్ బొప్పూడి రామారావు, జెడ్పీస్కూల్ పీఎంసీ చైర్మన్ సూరా శంకరరెడ్డి, బీసీ, ఎస్సీ సెల్ అధ్యక్షులు అవ్వారు సుబ్రహ్మణ్యం, కొండెపాటి నాగయ్య, చిలకలూరిపేట జేసీఎస్ కన్వీనర్ రవి శ్రీనివాస్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

క్రీడా నైపుణ్యాలు వెలికితీసేందుకే ఆడుదాం ఆంధ్ర

మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని



క్రీడా సామాగ్రితో మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, కౌన్సిలర్లు, అధికారులు

చిలకలూరిపేట: క్రీడా నైపుణ్యాలను వెలికి తీసేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని చేపట్టిందని మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని చెప్పారు. ఆడుదాం ఆంధ్ర క్రీడా కిట్లను పట్టణ పరిధిలోని 29 సచివాలయాల అడ్మిన్లకు మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ పరిధిలో క్రీడలు నిర్వహించి ప్రతిభ కనపరిచిన వారిని పట్టణ స్థాయిలో ఆడించేందుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. పట్టణ స్థాయిలో విజేతలకు నియోజకవర్గ స్థాయిలో, నియోజకవర్గ స్థాయి విజేతలను జిల్లా స్థాయిలో, జిల్లా స్థాయి విజేతలను రాష్ట్ర స్థాయికి తీసుకువెళతామన్నారు. ఈ క్రీడల ద్వారా ప్రతిభ ఉండి పోత్సాహం లేక మగ్గే క్రీడాకారులు రాష్ట్ర స్థాయి క్రీడల్లో పాల్గొనే సువర్ణ అవకాశం లభిస్తుందన్నారు. క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బాడ్మింటన్ క్రీడలలో మహిళలకు, పురుషులకు వేరువేరుగా పోటీలు జరుగుతాయన్నారు. 15 ఏళ్లకు పైబడిన బాలబాలికలు, మహిళలు, పురుషులు క్రీడలలో పాల్గొనవచ్చన్నారు. మండల స్థాయిలో ఎంపికైన క్రీడాకారులకు టీషర్ట్, క్యాప్, ప్రిస్ట్ బ్యాండ్, జిల్లా, రాష్ట్రస్థాయి విజేతలకు నగదు బహుమతి, ట్రోఫీ, మెడల్స్ అందజేస్తారన్నారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైందన్నారు. క్రీడల్లో పాల్గొనదలిచిన వారు వెంటనే తమ పరిధిలోని సచివాలయంలో తమకు నచ్చిన క్రీడలో పాల్గొనేందుకు పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు వార్డు సచివాలయాల్లో తెలుసుకోవచ్చన్నారు. ఆసక్తి కలిగిన వారందరూ ఈ క్రీడల్లో పాల్గొనవచ్చన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ కొలిశెట్టి శ్రీనివాసరావు, కౌన్సిలర్లు బేరింగ్ మౌలాలి, షేక్ నసీమాబేగం, అన్నపరెడ్డి శ్రీలక్ష్మి, చెమిటిగంటి పార్వతీదేవి, వడితే కోట్యానాయక్, చింతపల్లి విల్సన్, తోట నాగలక్ష్మి, చెంబేటి భారతి, మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు షేక్ బక్షు మేస్త్రీ, మున్సిపల్ డీఈఈ తోట వెంకటరమణ, శానిటరీ ఇన్స్పెక్టర్ షేక్ ఇస్మాయిల్ పాల్గొన్నారు.

ఆడుదాం-ఆంధ్రా కార్యక్రమం విజయవంతం చేయాలి

ఎంపీడీవో సీతారామయ్య



సదస్సులో పాల్గొని మాట్లాడుతున్న ఎంపీడీవో సీతారామయ్య

శావల్యాపురం: ఆడుదాం-ఆంధ్రా కార్యక్రమం విజయవంతం చేయాలని ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆడుదాం-ఆంధ్రా కార్యక్రమంపై సచివాలయ ఉద్యోగులు, పంచాయతీ కార్యదర్శులు,మహిళా పోలీసులు విద్యాశాఖాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ఈనెల 15 నుంచి 20 వరకు గ్రామసచివాలయ స్థాయిలో జరిగే ఆటలు పోటీల్లో పాల్గొనే క్రీడాకారుల నమోదు పురోగతి పెంచాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో యువతీ యువకులను క్రీడలపట్ల ఆసక్తి పెంపొందించటానికి కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, క్రికెట్, బాల్ బ్యాడ్మింటిన్ తదితర పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. ఇప్పటి వరకు 1254 మంది పురుషులు, మహిళలు -365 మంది ఆన్‌లైన్ నమోదు చేసుకున్నట్లు చెప్పారు. ప్రజాప్రతినిధులు అధికారులు సమన్వయంతో ఆడుదాం-ఆంధ్రా కార్యక్రమం విజయవంతం చేయాలన్నారు. ఈకార్యక్రమంలో ఎంఈవో పుసులూరి లలితాకుమారి, వ్యాయమ ఉపాధ్యాయులు రాగుల రాధాకృష్ణమూర్తి, కాకుమాను రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

డీఎంఅండ్‌హెచ్‌వో



బొల్లాపల్లి వైద్యశాలలో ఆశకార్యకర్తల సమావేశంలో డీఎంఅండ్‌హెచ్‌వో

బొల్లాపల్లి: విధి నిర్వహణలో శ్రద్ధ చూపాలని జిల్లా వైద్యాధికారి బి. రవి అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం సందర్శించారు. రికార్డులను పరిశీలించా రు. ఆశ కార్యకర్తల సమావేశంలో పాల్గొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో అందుతున్న వైద్యసేవలు గురించి ఆశ కార్యకర్తల నుంచి వివరాలు సేకరించారు. వారికిపలు సూచనలు, సలహాలు అందజేశారు. అనంతరం డీఎంఅండ్‌హెచ్‌వో మాట్లాడు తూ విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వైద్యశాలకు వచ్చే రోగులకు సక్రమంగా వైద్యసేవలు అందించాలని, ఎవరి విధులు వారు సమయ పాలన పాటించాలని ఆదేశించారు. వైద్య సేవల గురించి ఎటువంటి ఫిర్యాదులు లేకుండా చూసుకో వాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యులు ఎం. సాయి వినూత్న, స్టాఫ్ నర్సులు వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ముప్పాళ్లకు తప్పకుండా బస్సు నడుపుతాం

- డయల్ యువర్ డీఎంకు ఎనిమిది కాల్స్
- సమాధానాలు ఇచ్చిన డీఎం వీరాస్వామి



బస్టాండ్‌లో ఫోన్‌కాల్స్ స్వీకరిస్తున్న డీఎం వీరాస్వామి

నరసరావుపేట: ఆర్టీసీ డిపో నుంచి ఉదయం ఎనిమిది గంటలకు ముప్పాళ్లకు తప్పకుండా బస్సు నడుపుతామని డిపో మేనేజర్ బత్తుల వీరాస్వామి ప్రయాణీకులకు హామీ ఇచ్చారు. మంగళవారం ఆర్టీసీ బస్టాండ్‌లో నిర్వహించిన డయల్ యువర్ డీఎంకు డిపో పరిధిలోని ప్రజల నుంచి ఎనిమిది ఫోన్ కాల్స్ అందుకున్నారు. అందులో అధిక భాగం తమకు ఉదయం ఎనిమిది గంటలకు ముప్పాళ్లకు తిరిగే బస్సును క్రమం తప్పకుండా నడపాలని కోరారు. అలాగే బస్టాండ్‌లోని మరుగుదొడ్ల నిర్వాహకులు ప్రయాణీకుల వద్ద నుంచి రూ.10లు నుంచి రూ.15లు వసూలు చేస్తున్నారని పట్టణంలోని శ్రీనివాసనగర్‌కు చెందిన ప్రయాణీకుడు వీరాంజనేయులు ఫిర్యాదు చేయగా సంబంధిత కాంట్రాక్టర్‌ను పిలిచి కౌన్సెలింగ్ ఇచ్చి పెనాల్టీ విధిస్తామని హామీ ఇచ్చారు. అలాగే గ్యారేజ్‌కు ఎదురుగా బస్సులు నిలిపి భోజనాలు చేయటం వలన, బస్టాండ్ లోపల కార్గో పాయింట్ వద్ద బస్సులు నిలపటం వలన ట్రాఫిక్ అంతరాయం కలుగుతుందని ఫిర్యాదు చేశారు. దీనిపై డీఎం స్పందిస్తూ గ్యారేజ్ ఎదురుగా బస్సులు నిలుపకుండా చూస్తామని, బస్టాండ్‌లోకి ప్రవేశించే మార్గాన్ని త్వరలో మార్చబోతున్నందున ట్రాఫిక్ సమస్య తలెత్తదని పేర్కొన్నారు. ముప్పాళ్ల నుంచి పోస్టు మాస్టర్ జి.ధర్మారావు, రొంపిచర్ల సబ్‌పోస్టు మాస్టర్ ఉషారాణి, ముప్పాళ్ల హైస్కూలు టీచర్, ఆరోగ్యశాఖ ఉద్యోగి వి.లక్ష్మి, ఉపాధ్యాయురాలు ఎల్.ఊర్మిళ ఫోన్‌చేసి మాట్లాడుతూ ఉదయం ఎనిమిది గంటలకు ముప్పాళ్ల బస్సు ట్రిప్పును తప్పకుండా నిర్వహించాలని కోరారు. అలాగే రొంపిచర్ల మండలం కొత్తపల్లి నుంచి షేక్ గాలీబ్ ఫోన్‌చేసి తమ గ్రామానికి సక్రమంగా బస్సు రావట్లేదని ఫిర్యాదు చేశారు. దీనిపై డీఎం స్పందిస్తూ వర్షం వచ్చి రోడ్డు బాగాలేని పరిస్థితుల్లో తప్పితే బొమ్మరాజుపల్లి బస్సు రోజుకు రెండుసార్లు మీ గ్రామానికి వస్తుందని, ఆదివారం తప్ప చాకలిగుంట బస్సు రోజుకు రెండుసార్లు గ్రామానికి వస్తుందన్నారు.

రోడ్డు ప్రమాదంపై కేసు నమోదు

నాదెండ్ల: రోడ్డు ప్రమాదంలో తండ్రి కొడుకులకు గాయాలైన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై జె బలరామ్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు, నూజెండ్లపల్లి మండలం, కొత్తనాగిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన నాదెండ్ల శ్రీనివాసరావు, భార్య రమణ, కుమారుడు మోహన్‌అభిమన్యు ఈ నెల 10న వ్యక్తిగత పనులపై గుంటూరు వెళ్లి తిరిగి వచ్చే క్రమంలో గుంటూరు-కర్నూలు జాతీయ రహదారిపై సాతులూరు వద్ద వీరి బైక్‌ను ఎదురుగా వస్తున్న కారు ఢీకొంది. దీంతో తండ్రీకొడుకులకు గాయాలయ్యాయి. భార్యకు స్వల్ప గాయాలయ్యాయి. 108 సాయంతో వీరిని నరసరావుపేటలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేరారు. చికిత్స పొందుతూ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రోడ్డు ప్రమాదంపై కేసు నమోదు

నాదెండ్ల: రోడ్డు ప్రమాదంలో తండ్రి కొడుకులకు గాయాలైన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై జె బలరామ్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు, నూజెండ్లపల్లి మండలం, కొత్తనాగిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన నాదెండ్ల శ్రీనివాసరావు, భార్య రమణ, కుమారుడు మోహన్‌అభిమన్యు ఈ నెల 10న వ్యక్తిగత పనులపై గుంటూరు వెళ్లి తిరిగి వచ్చే క్రమంలో గుంటూరు-కర్నూలు జాతీయ రహదారిపై సాతులూరు వద్ద వీరి బైక్‌ను ఎదురుగా వస్తున్న కారు ఢీకొంది. దీంతో తండ్రీకొడుకులకు గాయాలయ్యాయి. భార్యకు స్వల్ప గాయాలయ్యాయి. 108 సాయంతో వీరిని నరసరావుపేటలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేరారు. చికిత్స పొందుతూ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పారదర్శకంగా ఓట్లు తొలగింపులు

శావల్యాపురం: మండలంలోని మతుకుమల్లి గ్రామంలో ఉన్న వారి ఓట్లు తొలగిస్తున్నారని టీడీపీ నాయకులు చేస్తున్న ఆరోపణలు ఎటువంటి నిజాలు లేవని తహసీల్దారు షేక్ జాన్‌సైదులు అన్నారు. మంగళవారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో తహసీల్దారు మాట్లాడుతూ ఓట్లు తొలిగింపులు పారదర్శకంగా జరుగుతున్నాయన్నారు. ప్రజలు ఆందోళన పడాల్సిన పనిలేదన్నారు. క్షేత్ర స్థాయిలో విచారణ చేసి వాస్తవాలు ఆధారంగా అర్హత కలిగిన ఉన్న వారందరికి ఓట్లు ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు.

16న చౌక్‌బాల్ రాష్ట్ర జట్ల ఎంపిక

చిలకలూరిపేటటౌన్: ఆంధ్రప్రదేశ్ చౌక్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జూనియర్ బాలబాలికల రాష్ట్ర జట్ల ఎంపికలను నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ చైర్మన్ చేబ్రోలు మహేష్ తెలిపారు. ఈ నెల 16వ తేదీ శనివారం మధ్యాహ్నం 2 గంటలకు పట్టణంలోని గ్రీన్‌వ్యాలీ స్కూల్‌లో ఎంపిక ఉంటుందని ఒక ప్రకటనలో వివరించారు. ఈ పోటీల్లో పాల్గొనే క్రీ డాకారులు ఆధార్ జిరాక్స్, పాస్‌పోర్టు సైజు ఫొటో తో హాజరుకావాలన్నారు. మరిన్ని వివరాలకు 9885408317 నంబర్ సంప్రదించాలన్నారు.

15న విభిన్న ప్రతిభావంతులకు క్రీడాపోటీలు

నరసరావుపేట: అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని పురస్కరించుకొని సత్తెనపల్లిరోడ్డులోని డీఎస్ఏ స్టేడియంలో ఈనెల 15వ తేదీ ఉదయం 9.30కు క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్లు విభిన్న ప్రతిభావంతులు, ట్రాన్స్‌జెండర్లు, వయోవృద్ధుల సంక్షేమశాఖ సహాయ సంచాలకులు సీహెచ్.సువార్త మంగళవారం వెల్లడించారు. రన్నింగ్, షార్టుపుట్, డిస్కస్‌త్రో, లాంగ్‌జంప్, చెస్ తదితర ఆటల్లో పోటీలు ఉంటాయన్నారు. ఆసక్తిగల విభిన్న ప్రతిభావంతులు పాల్గొని తమ నైపుణ్యాని ప్రదర్శించాలని కోరారు.

లారీ ఢీకొని ఆకుకూరల విక్రేత మృతి

చిలకలూరిపేటటౌన్: మండలంలోని మురికిపూడి గ్రామ శివారులో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆకుకూరలు అమ్ముకునే రైతు మృతి చెందాడు. రూరల్ పోలీసులు తెలిపిన వివరాలు..అప్పాపురం గ్రామానికి చెందిన చెరుకూరు శ్రీనివాసరావు (52) సమీప గ్రామాల్లో బైక్‌పై తిరుగుతూ నిత్యం కూరగాయలు, ఆకుకూరలు విక్రయిస్తుంటాడు. రోజు మాదిరిగానే కూరగాయలు విక్రయించేందుకు మురికిపూడి నుంచి రామచంద్రాపురం వచ్చే క్రమంలో మురికిపూడి ఊరి శివారులో ఉన్న విజేత గ్రానైట్ వద్ద లారీ రివర్స్ చేస్తుండగా ప్రమాదవశాత్తు బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో శ్రీనివాసరావు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. పోలీసులు మృతదేహాన్ని చిలకలూరిపేట ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నినదించిన గ్రామీణ డాక్ సేవక్స్



సమ్మెలో పాల్గొన్న గ్రామీణ డాక్ సేవక్స్

వినుకొండ(నూజెండ్ల): ఆల్ ఇండియా గ్రామీణ డాక్ సేవక్స్ యూనియన్ ఆధ్వర్యంలో పట్టణంలోని బోసుబొమ్మ సెంటర్ వద్ద ఉన్న పెద్దపోస్టాఫీసు ఆవరణలో నిరవధిక సమ్మెను నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు జీడీఎస్, పీజేసీఏ, కేంద్ర సంఘాల పిలుపుమేరకు ధర్నా చేపట్టినట్లు తెలిపారు. 8 గంటల పని భారం కల్పించాలని, అదనపు సర్వీస్ ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలి, 180 రోజుల వరకు సెలవులు దాచుకొని నగదుగా మార్చుకునే సౌకర్యం కల్పించాలని, కమలేష్ చంద్ర కమిటీ సిఫార్సు చేసిన బంచింగ్ అమలు చేయాలని, జీడీఎస్ కాంట్రిబ్యూషన్ ఎస్‌డీబీఎస్ 10 శాతం, డిపార్ట్‌మెంట్ 10 శాతం కాంట్రిబ్యూషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు వై.పాపిరెడ్డి, అజయ్‌కుమార్, గాలెయ్య, రామసుబ్బయ్య, మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లు.. మీ సేవలు మరువలేనివి

ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు



నూతన సంవత్సర కానుకలను అందజేస్తున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

వినుకొండ (నూజెండ్ల): ప్రజలకు వలంటీర్లు చేసే సేవలు మరువలేవని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. పట్టణంలోని బొల్లా బ్రహ్మనాయుడు కన్వెన్షన్ హాల్‌లో బొల్లాపల్లి మండలంలోని అన్ని సచివాలయాల వలంటీర్లు, గృహసారధులు, గ్రామసచివాలయ కన్వీనర్స్‌తో ఆత్మీయ సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. కరోనా సమయంలో వలంటీర్లు చేసిన సేవలు అద్భుతమని అన్నారు. అలాగే వారు ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిలా వ్యవహరిస్తున్న తీరు హర్షణీయమన్నారు. ఇలాగే రానున్న రోజుల్లో కూడా ప్రభుత్వం అందజేసే పథకాలు ప్రజలకు ఇంకా చేరువ చేసేందుకు ప్రయత్నం చేయాలని సూచించారు. అలాగే ప్రభుత్వ కార్యక్రమం అయిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో నాకు ఎంతో సహకరించి త్వరితగతిన పూర్తి చేసేందుకు సహకారం అందించారన్నారు. అలాగే వలంటీర్లకు ఇద్దరు గృహసారథులను నియమించి ప్రభుత్వ పథకాలు ప్రజలకు మరింత చేరువ చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో బొల్లాపల్లి మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముగిసిన కార్తిక మాసం



విప్పర్ల శివాలయంలో లింగాకారంలో దీపోత్సవం



యడ్లపాడు బ్రహ్మంగారి గుడిలో దీపార్చన



వినుకొండ రామాలయంలో దీపోత్సవంలో పాల్గొన్న భక్తులు

యడ్లపాడు: కార్తిక అమావాస్య సందర్భంగా మంగళవారం పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని సొలస గ్రామంలోని బ్రహ్మంగారి ఆలయం, శ్రీభూసమేత రంగనా యకస్వామి దేవస్థానంలో కార్తిక మాసం చివరిరోజు సందర్భంగా మహాశివునికి ప్రత్యేక అలంకరణ చేసి దీపార్చన చేశారు. ఆయా ప్రాంగణంలో రంగవల్లులు, రంగురంగుల పూలు వివిధ ఆకారాల్లో ఏర్పాటు చేసి వాటి మధ్య దీపాలను అలంకరించి పూజలు నిర్వహించారు.

వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని ఆగాబావి బజారులో గల శ్రీ రామాలయంలో కార్తిక దీపోత్సవం నిర్వహించారు. నాలుగు వేల ఒత్తులతో దీపార్చన నిర్వహించారు. కార్యక్రమంలో మహిళలు పాల్గొని శివనామాన్ని పఠించారు. ప్రముఖ చిత్రకారుడు ప్రసాద్ రూపకల్పనలో శివలింగాకారాన్ని తయారు చేయడం జరిగింది. కార్యక్రమంలో కమిటీ సభ్యులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అదేవిధంగా పట్టణంలోని బోసుబొమ్మ సెంటర్‌లో వేంచేసి ఉన్న శ్రీ సమర్థ సద్గురు షిరిడీసాయిబాబా మందిరంలో మాస శివరాత్రిని పురస్కరించుకొని 6 వేల ప్రమిదలతో ఆరు కోట్ల ఒత్తులతో దీపోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో పోతుకూచి వెంకట శ్రీనివాసశర్మ, ఆలయ అధ్యక్షులు ప్రసాదరావు, కె.సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

నాదెండ్ల: గణపవరం గ్రామంలో నూతనంగా నిర్మించిన గణపతి వాసవీ కన్యకా పరమేశ్వరి సహిత కోదండ రామాలయంలో కార్తిక మాసాన్ని పురస్కరించుకుని కార్తిక మాస పూజలు మంగళవారం భక్తిశ్రద్ధలతో ముగిశాయి. ఈ నెల 10న ప్రారంభమైన పూజల్లో భాగంగా భవానీశంకర స్వామి వారికి ఏకాదశి రుద్రాభిషేకం నిర్వహించారు. ఆలయ ప్రధాన పూజార్లు దర్శి ఉమామహేశ్వర శర్మ, అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో కార్తిక మాస పూజలు జరిగాయి. ఆలయాల వద్ద భక్తులు దీపాలు వెలిగించి పూజలు నిర్వహించారు.

రొంపిచర్ల: మండలంలోని శివాలయాలన్నీ సోమవారం రాత్రి భక్తులతో పోటెత్తాయి. కార్తీక మాసం ఆఖరి సోమవారం కావటంతో అధిక సంఖ్యలో భక్తులు ఆలయాలను దర్శించుకున్నారు. ఉపవాసాలు ఉండి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ప్రత్యేక అలంకరణలో దీపోత్సవాలు నిర్వహించారు. భక్తుల శివనామస్మరణతో ఆలయాలు మార్మోగాయి.

ఘనంగా అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం



విజేతలకు బహుమతులు అందజేస్తున్న సర్పంచ్, ఎంఈవో2 తదితరులు

బొల్లాపల్లి: మండల కేంద్రమైన బొల్లాపల్లి భవితా కేంద్రంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ చైర్మన్ అపర్ణ, సర్పంచ్ శిఖా జ్యోత్స్న, ఎంఈవో2, ఐఈఆర్‌పీ ఏడీ బాబు రావు, సుభాషిణి, ఫిజియోథెరపిస్ట్ ఎం. నాగరాజు, ప్రధానోపాధ్యాయులు అరుణ జాస్మిన్, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

తప్పులు..తలనొప్పులు లేకుండా చూడండి..

- నియోజకవర్గ ఓటరు నమోదు అధికారి జి.వసంతబాబు
- యడ్లపాడు బీఎల్‌వోలతో సమీక్ష సమావేశం



సమీక్షలో మాట్లాడుతున్న ఈఆర్‌వో జి వసంతబాబు

యడ్లపాడు: చిన్నపాటి తప్పు లేకుండా కచ్చితమైన వివరాలతో కూడిన ఓటర్ల జాబితాను రూపొందించాలని నియోజకవర్గ ఓటరు నమోదు అధికారి జి.వసంతబాబు చెప్పారు. స్థానిక ఒకటో గ్రామ సచివాలయంలో ఓటర్ల జాబితా స్వచ్ఛీకరణపై తహసీల్దార్ వైవీబీ కుటుంబరావుతో కలిసి బీఎల్‌వోలకు సమీక్ష సమావేశం నిర్వహించారు. బీఎల్‌వోలు అనుసరించాల్సిన మార్గదర్శకాలు, విధి విధానాలపై అవగాహన కల్పించారు. ఓటర్ల జాబితా ప్రక్రియలో భాగస్వాములైన ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలన్నారు. ప్రతి ఎన్నికల కమిషన్ పరిశీలిస్తుందని అందరూ జాగ్రత్తగా వహించాలని చెప్పారు. డూప్లికేట్ ఓట్ల తొలగింపులో పారదర్శక విధానాలు పాటించాలని, ప్రజా ప్రతినిధుల నుంచి వచ్చే ఫిర్యాదులకు సకాలంలో పరిష్కారం చూపాలని ఆదేశించారు. పెండింగ్ దరఖాస్తులను వీలైనంత త్వరగా పరిష్కరించాలన్నారు. జాబితాలో తప్పులు దొర్లితే ఈఆర్వోలే బాధ్యత తీసుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. కొత్త ఓట్లపై చైతన్యం కలిగించి యువ ఓటర్లకు అవకాశం కల్పించాలని తెలిపారు. సమావేశంలో బీఎల్‌వోలతో పాటు ఎన్నికల సూపర్‌వైజర్లు హాజరయ్యారు.

మూడురోజుల పాటురైల్వే గేటు మూసివేత

నరసరావుపేట: గుంటూరు-నంద్యాల మార్గంలోని సాతులూరు-నరసరావుపేట మధ్య అత్యవసర పనుల నిమిత్తం ఎల్‌సీ నంబరు 291 గేటును మూడురోజుల పాటు మూసివేయటం జరుగుతుందని రైల్వే ఆఫీసర్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆ మార్గంలో ప్రయాణించే వినియోగదారులు ప్రత్యామ్నాయ మార్గాలు చూసుకోవాలని ఆయన సూచించారు.